
సాక్షి ఒడిశా

మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,58,119లు, బంగారం 5గ్రాము 280 మిల్లీగ్రాములు, వెండి 69 గ్రాములు 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మహాత్మా మనసాస్మరామి

రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.

- 8లో



జన సంపర్క్ పాదయాత్ర ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోమవారం జన సంపర్క్ పాదయాత్ర ప్రారంభించారు.

- 8లో

న్యూస్‌రీల్

చిలికాలో చిక్కుకున్న ప్రయాణికుల బోటు



సరస్సు మధ్యలో చిక్కుకున్న ప్రయాణికుల బోటు

బరంపురం: ఆసియాలోనే అతి పెద్దదైన ఉప్పునీటి చిలికా సరస్సులో ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సోమవారం సతపడి నుంచి కృష్ణప్రసాద్ బ్లాక్ కార్యాలయానికి సుమారు 50 నుంచి 60 మంది ప్రయాణికులు, 30 ద్విచక్ర వాహనాలతో బయల్దేరిన బోటు, చిలికా సరస్సులో కొంతదూరం ప్రయాణించిన తర్వాత చెడిపోయింది. దీంతో సరస్సు మధ్యలోనే బోటు చిక్కుకోవడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. సుమారు 6 గంటల పాటు ప్రాణభయంతో గడిపారు. చివరకు మరొక బోటు సాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు.

పిడుగులు పడి 11 పశువులు దుర్మరణం



పిడుగు పడి మరణించిన పశువులు

జయపురం: రెండు వేర్వేరు ప్రాంతాల్లో పిడుగులు పడి 11 ఆవులు దుర్మరణం పాలయ్యాయి. ఈ సంఘటనలు జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. బొయిపరిగుడ సమితి గుప్తేశ్వర్ గ్రామ పంచాయతీ గయలకొండ గ్రామ సమీపంలోని కొండపైకి ఆవులను ఒక వ్యక్తి మేతకు తీసుకెళ్లాడు. అనంతరం ఆవులను ఆ ప్రాంతంలో ఉంచి భోజనానికి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం ప్రారంభమైంది. పశువులు ఉన్న ప్రాంతంలో పిడుగులు పడడంతో అక్కడ 10 గోవులు దుర్మరణం చెందాయి. అదే సమయంలో గుప్తేశ్వర్ గ్రామ పంచాయతీ డెంగాపకన గ్రామం ప్రాంతంలో ఒక వ్యక్తి తన పాడి గేదెను ఒక వెదురు దుంగకు కట్టాడు. ఆ సమయంలో ఆ గేదెపై పిడుగుపడి సంఘటన స్థలంలోనే మరణించింది. దీంతో తమకు న్యాయం చేయాలని పశువుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

రూ.2,31,575 లకు లడ్డూ వేలంపాట



మిత్రులతో వేలంలో లడ్డూ దక్కించుకున్న సుమిత్, హరిలు

జయపురం: స్థానిక ఎంజీ రోడ్డులో ప్లాటినం జూబ్లీ జరుపుకుంటున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా సోమవారం లడ్డూ వేలంపాట నిర్వహించారు. సుమారు 75 కేజీల లడ్డూను సుమిత్ సామంత, టంగుడి హరి కలిసి వేలంపాటలో రూ.2,31,575 లకు దక్కించుకున్నారు. దీంతో వీరిని పలువురు అభినందించారు.

గజేంద్రుడు మృత్యువాత



దర్యాప్తు చేపడుతున్న తారసింగ్ అటవీ శాఖ అధికారుల బృందం

బరంపురం: గంజాం జిల్లాలోని ఉత్తర గుముసర తారసింగ్ అటవీ ప్రాంతం బనపూర్ గ్రామంలోని వ్యవసాయ భూమిలో మగ ఏనుగు మృతి చెందిన విషయాన్ని సోమవారం గమనించిన స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. తారసింగ్ అటవీ రేంజర్ కృష్ణదాస్, ఏసీఎఫ్ విక్రమ్ దేవ్ పటానాయక్‌లు తమ బృందంతో ఏనుగు మృతి చెందిన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అటవీ అధికారులు తెలిపిన సమాచారం మేరకు.. 4 రోజు నుంచి గుముసరా అడవి నుంచి కిరండమల్ అడవిలోకి 13 ఏనుగుల గుంపు చికిటి బ్లాక్ పరిధిలోని వరి కుప్పలు తినేందుకు వచ్చి సంచరిస్తున్నట్లు చెప్పారు. అయితే వీటిలో ఒక ఏనుగు మృతి చెందినట్లు తెలిపారు. పశు వైద్యుల సాయంతో పోస్టుమార్టం నిర్వహించి, అక్కడే పాతిపెట్టారు. అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓ మహాత్మా.. ఓ మహర్షి



రాజ్ భవన్‌లోని అభిషేక్ హాల్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్



రాష్ట్ర శాసన సభ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి దివంగత లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌లు వారికి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం నవీన్ పట్నాయక్ మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్య్ర పోరాటానికి గాంధీజీ అచంచలమైన అంకితభావంతో కూడిన ఆదర్శాలు, రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని కొనియాడారు. అలాగే లాల్ బహదూర్ శాస్త్రి గొప్ప స్వాతంత్య్ర సమరయోధుడు మరియు రాజనీతిజ్ఞుడని పేర్కొన్నారు. 'జై జవాన్, జై కిసాన్' నినాదంతో భారతదేశ నిజమైన స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని తెలియజేశారు.

– భువనేశ్వర్

ప్రైవేటు బస్సుల సమ్మె విజయవంతం



మల్కన్‌గిరి: స్టాండ్‌కే పరిమితమైన ప్రైవేటు బస్సులు

జయపురం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లక్ష్మీ బస్సుల పథకాన్ని వ్యతిరేకిస్తూ ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు చేపట్టిన బస్సుల సమ్మె సోమవారం విజయవంతమైంది. సమ్మెతో అవిభక్త కొరాపుట్ జిల్లాలు నవరంగపూర్, కొరాపుట్, రాయగడ, మల్కన్‌గిరిల్లో ప్రైవేట్ బస్సులు ఉదయం 6 గంటల నుంచి ఆగిపోయాయి. దీంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వాస్తవంగా అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో ప్రభుత్వ బస్సులు నామమాత్రంగా ఉండడంతో, ప్రజలు ఎక్కువగా ప్రైవేట్ బస్సులపైనే ఆధారపడుతున్నారు. దీంతో బంద్ కారణంగా ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి పట్టణాలకు కాయగూరలు ఇతర వస్తువులు తీసుకు రాలేకపోయినట్లు తెలిసింది. ఈ సందర్భంగా అవిభక్త కొరాపుట్ ప్రైవేట్ బస్సు యజమానుల సంఘ నేత, జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి మాట్లాడుతూ.. బంద్‌తో అవిభక్త కొరాపుట్‌లో ప్రయాణ సౌకర్యాలు కల్పించడంలో కీలక పాత్ర వహిస్తున్న 2,000లకు పైగా ప్రైవేటు బస్సులు నిలిచిపోయాయని వెల్లడించారు. లక్ష్మీ బస్సుల పథకం నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు బస్సులకు అప్పగించాలని, లేదా ప్రైవేట్ బస్సుల యజమానుల కొత్త బస్సులను ప్రభుత్వం తీసుకొని కిలోమీటర్ ప్రకారం డబ్బులు చెల్లించాలని కోరారు. మంగళవారం ఉదయం 6 గంటల వరకు బంద్ కొనసాగుతుందని వెల్లడించారు.

రాయగడ: అవిభక్త కొరాపుట్ జిల్లా ప్రైవేట్ బస్సుల యజమానుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు రాయగడలో ప్రైవేట్ బస్సుల యజమానులు బస్సుల రాకపోకలను నిలిపివేశారు. దీంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మల్కన్‌గిరి: ప్రభుత్వం తీసుకొచ్చిన లక్ష్మీ పథకాన్ని వ్యతిరేకిస్తూ జిల్లావ్యాప్తంగా ప్రైవేటు బస్సులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో మల్కన్‌గిరి నుంచి భువనేశ్వర్, రాయిపూర్, సంబల్‌పూర్, హైదారాబాద్, బార్మపూర్‌కు వెళ్లే బస్సులను నిలిపివేశారు. ముందుగా టికెట్లు కొన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



మల్కన్‌గిరి: ధర్నాలో పాల్గొన్న యజమానులు, డ్రైవర్లు



రాయగడ: బస్టాండ్‌లో నిలిచిపోయిన ప్రైవేట్ బస్సులు



జయపురం: మాట్లాడుతున్న నరేంద్ర మహంతి



జయపురం: ప్రైవేట్ బస్టాండ్‌లో నిలిచిన బస్సులు

పులి చర్మం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పులి చర్మాన్ని చూపిస్తున్న అటవీ శాఖ అధికారులు

● ఒకరు అరెస్టు

రాయగడ:

జిల్లాలోని మునిగుడ అటవీ రేంజ్ పరిధి జగదల్‌పూర్ బీట్ బొడొకందులపడ గ్రామంలో సోమవారం అటవీ శాఖ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో ఒక పులి చర్మంతో పాటు రెండు దేశీ తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... గ్రామంలో పులి చర్మాల క్రయవిక్రయాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం ప్రకారం అటవీ శాఖ రేంజర్ అనిల్ కుమార్ బాలా, సిబ్బంది ప్రమోదిని మండంగి, సుభాషిణి ములి, రొనిత్ కుమార్ మహారాణ, సురేష్ పాత్రో, ఫారెస్టు గార్డులు పి.దండసేన, పింకి భుయ్యాన్, సర్మిష్ట బాడజెన, కస్తూరీ దండసేనాలు రెండు బృందాలుగా ఏర్పడి బొడొకందులపడ గ్రామంలో దాడులను నిర్వహించారు. ఈ క్రమంలో ఒక ఇంటిలో గోనె సంచెను తనిఖీ చేయగా అందులో పులిచర్మంతో పాటు రెండు తుపాకీలు పట్టుబడ్డాయి. దీంతో గ్రామానికి చెందిన కేతన్ అందిక (29) అనే యువకుడిని అరెస్టు చేసి మునిగుడ ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. పులిచర్మంతో పాటు దాని గోళ్లు, ఇతర వస్తువులు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. అయితే వీటిని ఎవరికి విక్రయిస్తున్నారు, దానికి సంబంధించిన ముఠాను పట్టుకునే దిశగా తమ దర్యాప్తు కొనసాగుతుందని రేంజర్ అనిల్ కుమార్ బాల తెలియజేశారు.



పులిచర్మం, తుపాకీలతో నిందితుడు

విద్యార్థులకు స్వెట్టర్ల పంపిణీ



స్వెట్టర్లతో విద్యార్థులు

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి పరిధి 135 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 2507 మంది విద్యార్థులకు ఐసీడీఎస్ అధికారులు సోమవారం స్వెట్టర్లు పంపిణీ చేశారు. త్వరలో శీతాకాలం ప్రవేశిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు అంగన్‌వాడీ విద్యార్థులకు స్వెట్టర్ల పంపిణీకి ఆదేశించిందని రామనగుడ సెక్టార్ సూపర్‌వైజర్ శుబుద్ధి సాబొరొ, పద్మిని బొడొకుమార్, బిజయలక్ష్మి పిర్కాక, భాగ్యవతి నాయక్ తదితరులు తెలియజేశారు.

పర్యావరణ హితం.. 'ప్లాస్టిక్ ఏనుగు'

బరంపురం: స్థానిక ఇంజినీరింగ్ స్కూల్ రోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు చెందిన విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలతో ఏనుగు నమూనాను తయారు చేశారు. ఈ ఏనుగు నమూనాను బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ కుమార్ పండాలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ చంద్రశేఖర్ సాహు మాట్లాడుతూ బరంపురం నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు ప్రపంచంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో మరిన్ని నమూనాలు తయారు చేయాలని, కళాశాలకు ప్రభుత్వ సహకారం తప్పనిసరిగా ఉంటుందని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.రజక్ పాణిగ్రహి మాట్లాడుతూ గతంలో పాత ఇనుప సామగ్రితో 73 అడుగుల గిటార్, 35 అడుగుల జిరాఫీ నమూనాలు తయారు చేసి, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం గోపాల్‌పూర్ తీరంలో కొత్తగా నిర్మాణం జరుగుతున్న ఈకో పార్క్‌లో ఆకట్టుకునేందుకు వివిధ రకాల కళాకృతుల నమూనాల తయారు చేసేందుకు ప్రభుత్వం నుంచి బరంపురం ఐటీఐ కాంట్రాక్ట్ దక్కించుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ సంఘమిత్ర దొళాయి, మాజీ ఎమ్మెల్యే రమేష్ చంద్ర చావ్ పట్నాయక్, బీడీఏ చైర్మన్ సుభాష్ మహరణా తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ ఏనుగును ప్రారంభిస్తున్న దృశ్యం

భారీగా గంజాయి పట్టివేత



బరంపురం: గంజాయి, అరెస్టైన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: పట్టణానికి సమీపంలోని 59వ నంబర్ జాతీయ రహదారి మీద కారులో తరలిస్తున్న 315 కిలోల గంజాయిని బరంపురం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాం ఎస్పీ జగ్‌మోహన మీన తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం పట్టపూర్ దగ్గర 59వ నంబర్ జాతీయ రహదారి మీదుగా వస్తున్న కారులో గంజాయి రవాణా అవుతున్నట్లు ఎక్సైజ్ అధికారులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో పోలీసులు ధనుంజయ్‌పూర్ దగ్గర జాతీయ రహదారిలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అతివేగంతో వస్తున్న కారును అనుమానాస్పదంగా అనిపించడంతో తనిఖీలు చేశారు. కారులో 11 బస్తాల్లో ఉన్నటువంటి 315 కిలోల గంజాయితో పాటు కారుని సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో గంజాం జిల్లాకి చెందిన రబింద్ర నాయక్, ప్రశాంత్ ప్రధాన్‌లుగా ఉన్నట్లు గుర్తించారు.

మరో 120 కిలోలు సీజ్

పట్టపూర్ పోలీసులు, బరంపురం ఎక్సైజ్ పోలీసులు రెండు ద్విచక్ర వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న మరో 120 కిలోల గంజాయిని సీజ్ చేశారు. ఐఐసీ అధికారి గీతాంజాలి సాహు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం ఉదయం కొంధమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి రెండు స్కూటీలతో గంజాయి తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం అందింది. దీంతో బరంపురం ఎక్సైజ్ అధికారులు నగర శివారులోని ఫస్ట్ గేట్ జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు స్కూటీల్లో 120 కిలోల గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వారు మహరాష్ట్రకు చెందినవారుగా గుర్తించారు.

6 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

మల్కన్‌గిరి: జిల్లా పోలీసులు ఆదివారం రాత్రి మలకన్‌గిరి సమితి చంపఖారీ గ్రామం వద్ద మూడు బొలేరో వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 6 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి ఎస్ఐ సర్వేశ్వర్ బోయి తన సిబ్బందితో కలిసి చంపఖారీ గ్రామం వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో అతి వేగంగా జయపురం వైపునకు వెళ్తున్న మూడు వాహనాలను ఆపి తనిఖీ చేయగా, అందులో గంజాయిని గుర్తించారు. వెంటనే వాహనాలను సీజ్ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నిందితులను విచారించగా మల్కన్‌గిరి తోలసాహి వీధికి చెందిన ఎం.మోహన్‌రావు, చిత్రకొండ సమితికి చెందిన పద్మన్ ముదులి, నక్కమమ్ముడి గ్రామానికి చెందిన శివశంకర్ ఖీలోలుగా గుర్తించారు. నిందితుల వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.350 నగదును స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తూకం వేయగా 6 క్వింటాళ్ల 3 కేజీలు ఉంది. గంజాయిని ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రం తరలిస్తున్నట్లు మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో తెలిపారు.



120 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు



మల్కన్‌గిరి: అరెస్టైన నిందితులు

రాయగడలో మరో నాలుగు కల్యాణ మండపాలు



బురదల పోలమ్మ మందిరం వద్ద స్థలం పరిశీలిస్తున్న నెక్కంటి, పట్నాయక్‌లు

రాయగడ:

పట్టణ ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు కల్యాణ మండపాల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సుమారు రూ.5 కోట్లు మంజూరు చేసింది. రాయగడ మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, రాజ్యసభ మాజీ ఎంపీ, బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటిలు స్థానిక బురదల పోలమ్మ మందిరం ప్రాంగణంలో స్థలాన్ని పరిశీలించారు. అదేవిధంగా కస్తూరీ నగర్, రైతుల కాలనీ తదితర ప్రాంతాల్లోనూ స్థల పరిశీలన చేపట్టారు. ప్రజలకు అనువుగా ఉండే ప్రాంతాల్లో త్వరితగతిన నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలియజేశారు.

క్లుప్తంగా

ఆదిత్యునిపై భక్తి గీతాలాపన



అనివేటి మండపంలో గీతాలు ఆలపిస్తున్న శ్రీలలిత

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని ప్రముఖ గాయని భమిడిపాటి శ్రీలలిత సోమవారం దర్శించుకున్నారు. అనంతరం అనివేటి మండపంలో పలు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరి సూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పాలక మండలి మాజీ సభ్యురాలు యామిజాల గాయత్రి ఉన్నారు.

అక్కుపల్లి ప్రిన్సిపాల్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు



సన్మానం పొందుతున్న పాపారావు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ముంజేటి పాపారావును రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకునిగా వీఎస్ఆర్ ఫౌండేషన్ (గుంటూరు) వారు గుర్తించారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం గుంటూరులో గల రెవెన్యూ భవన్‌లో ఘనంగా సన్మానించి జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 మందిని ఎంపిక చేయగా శ్రీకాకుళం జిల్లా నుంచి పాపారావు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనను బీసీ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సత్కరించారు.

విద్యుత్ భద్రతపై అవగాహన



నగరంలో భద్రతా అవగాహన ర్యాలీని చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

అరసవల్లి: విద్యుత్ ఆదాతో భద్రతపై కూడా వినియోగదారులు మరింత అవగాహన పెంచుకోవాలని విద్యుత్ శాఖ ఆపరేషన్స్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం విద్యుత్ భద్రతపై అవగాహన కల్పిస్తూ నగరంలో డీ-2 కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు విద్యుత్ ఇంజినీరింగ్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇకమీదట ప్రతి నెలా 2వ తేదీన ఇలాంటి భద్రత అవగాహన ర్యాలీని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇది కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ బగ్గు రాంబాబు, డి2, డి2 ఏఈలు జె.సురేష్‌కుమార్, కమల్‌హాసన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాపారావు, నారాయణరావు, కాంట్రాక్టర్ ఉంగటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ



గాయపడిన షణ్ముఖరావును అంబులెన్స్‌లో తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని సోమవారం జీటీ రోడ్డు సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొట్టుకున్నాయని ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ఎస్ దొర పేర్కొన్నారు. ఎస్ఐ, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. హిరమండలం గ్రామానికి చెందిన కిల్లాన షణ్ముఖరావు కుటుంబసభ్యులతో కలిసి ఏడు రోడ్ల కూడలిలో ఉన్న వీనస్ హోటల్‌కు వెళ్తుండగా మొగదాలపాడు గ్రామానికి చెందిన కొమర నరహరి అతి వేగంగా ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో షణ్ముఖరావు కాలు విరిగిపోవడమే కాక చిన్న చిన్న గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై అరిణాం అక్కివలస సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి, గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. మృతుడి వయసు 35-45 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉంది. మృతుని వివరాల కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం

వజ్రపుకొత్తూరు: మండలం పెద్దమురహరిపురం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గొరకల రామారావు భారత సైన్యంలో 24 ఏళ్లుగా సేవలు చేసి రెండు రోజుల కిందట రిటైరయ్యారు. ఆయన సోమవారం స్వగ్రామానికి రావడంతో సైనిక సేవా సమితి, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూండి నుంచి స్వగ్రామం వరకు ఊరేగింపుగా సాదరస్వాగతం పలికారు.



జయపురం: మహాత్మునికి నివాళులర్పిస్తున్న దృశ్యం



జయపురం: కోర్టు ఆవరణలో బాపూజీకి నివాళులర్పిస్తున్న దృశ్యం



బరంపురం: గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



బరంపురం: గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దివ్య జ్యోతి పరిధా తదితరులు



జయపురం: జిల్లా కాంగ్రెస్ భవన్‌లో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మహాత్మా మనసాస్మరామి

రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు బాపూజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను వివరించారు. మహాత్ముని జీవితం స్ఫూర్తిదాయకమని, సత్యాన్ని మించిన ఆయుధం లేదని, అహింసకు సాటివచ్చే ఉద్యమం లేదని బలంగా నమ్మిన ఆయన, శాంతియుత నిరసనల ద్వారా దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చిన తీరు ప్రపంచానికే ఆదర్శమన్నారు. మనమంతా గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



జయపురం: గాంధీ పార్క్‌లో గాంధీ విగ్రహానికి నివాళులు



మల్కన్‌గిరి: డైలీ మార్కెట్ వద్ద గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేడీ నేతలు



భువనేశ్వర్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్



పర్లాకిమిడి: ప్రభుత్వ గాంధీ స్మారక ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్మన్ తిరుపతిరావు



రాయగడ: రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: గాంధీజీ చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: పట్టణంలో వివిధ పాఠశాలల విద్యార్థుల ర్యాలీ



జయపురం: ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎస్పీ అభినవ సనకర్



రాయగడ: ర్యాలీలో పాల్గొన్న మంత్రి సరక, ఎమ్మెల్యే ముదులి

జన సంపర్క్ పాదయాత్ర ప్రారంభం

- ప్రతిపక్షాలు ప్రజా వ్యతిరేకులు
- సీఎం నవీన్ పట్నాయక్



భువనేశ్వర్: బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గాంధీ జయంతి సందర్భంగా బిజూ జనతా దళ్ (బీజేడీ) అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోమవారం జన సంపర్క్ పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూరీ శ్రీమందిరం మరియు భువనేశ్వర్ లింగరాజ దేవాలయం అభివృద్ధిని ఆపడంతో పాటు ఇంటి ముంగిట ప్రజల ఫిర్యాదుల పరిష్కారాన్ని వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలకు రానున్న 2024 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. విపక్షాలు ప్రజా వ్యతిరేకులని ఆయన బహిరంగంగా వ్యాఖ్యానించారు. పూరీ శ్రీమందిరం, భువనేశ్వర లింగరాజు ఆలయ అభివృద్ధి పనులను ఆపేందుకు కుట్ర పన్నిన వారిని రాష్ట్ర ప్రజలు ఎన్నడూ క్షమించరన్నారు. విపక్షాలు తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. ఈనెల 11వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ పంచాయతీలో జన సంపర్క్ పాదయాత్ర నిరవధికంగా కొనసాగుతుందని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అణగారిన, మహిళలు, షెడ్యూల్డు తెగలు, షెడ్యూల్డు కులాలు మరియు రాష్ట్ర యువత పురోగతికి కృషి చేస్తోందని పేర్కొన్నారు.

పర్లాకిమిడి: ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకు గజపతి జిల్లా పర్లాకిమిడి నుంచి జన సంపర్క్ పాదయాత్రను బీజేడీ అధ్యక్షుడు జగబంధు దాస్ ప్రారంభించారు. తొలుత హైస్కూల్ జంక్షన్ వద్ద బిజూ పట్నాయిక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాలేజీ జంక్షన్ నుంచి కొత్త బస్టాండ్ వరకు నిర్వహించిన పాదయాత్రలో కాశీనగర్, గుమ్మా, గుసాని సమితి నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేడీ యువ నాయకులు రూపేష్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, రాష్ట్ర బీజేడీ సాధారణ కార్యదర్శి ప్రదీప్ కుమార్, ఎస్టీసీ చైర్మన్ మరియం రైతో తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: పాదయాత్ర నిర్వహిస్తున్న బీజేడీ నాయకులు



భువనేశ్వర్: సమావేశానికి హాజరైన ప్రజలు

'నూతన విద్యావిధానంపై విస్తృత చర్చ'

ఎచ్చెర్ల క్యాంపస్: నూతన విద్యావిధానం 2020పై విస్తృత చర్చ అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ అన్నారు. వర్సిటీలో ఈ మేరకు 4,5 తేదీల్లో నూతన విద్యావిధానం అమలు, సవాళ్ల అంశంపై విద్యా విభాగం ఆధ్వర్యంలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు చెప్పారు. నేషనల్ కౌన్సెల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్, ఢిల్లీకి చెందిన ఇండియాన్ కౌన్సెల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సంస్థ, సమగ్ర శిక్ష సంస్థల ఆధ్వర్యంలో ఈ సెమినార్ నిర్వహించనున్నట్లు వివరించా రు. ప్రస్తుతం నూతన విద్యా విధానం అమలు నేపథ్యంలో 5+3+3+4 విధానంలో విద్య కొనసాగుతుందని చెప్పారు. ఎర్లీ ఎడ్యుకేషన్, స్కూల్ ఎడ్యుకేషన్, హయర్ ఎడ్యుకేషన్, ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్, ఒకేషనల్ ఎడ్యుకేషన్, టెక్నికల్ ఎడ్యుకేషన్, స్పె షల్ ఎడ్యుకేషన్ అమలు జరుగుతుందని అన్నారు. ఈ మేరకు సెమినార్‌కు 100 పరిశోధన పత్రాలు వచ్చాయని, ఈ పత్రాలతో సావనీర్ విడుదల చేస్తామని అన్నారు. సమావేశంలో సెమినార్ కన్వీనర్ డాక్టర్ హనుమంతు సుబ్రహ్మణ్యం, సహాయ కన్వీనర్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్ హాజరయ్యారు.

మర బోటు బోల్తా

- మత్స్యకారులు సురక్షితం

వజ్రపుకొత్తూరు రూరల్: డోకులపాడు సముద్ర తీరంలో ఆదివారం రాత్రి మర బోటు బోల్తా పడింది. అయితే మత్స్యకారులు సురక్షితంగా బయటపడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. మంచినీళ్లపేట గ్రామానికి చెందిన బోటు యజమాని బుంగ సవరయ్యతో పాటు మరి కొంత మంది మత్స్యకారులు చెక్క యర్రయ్య, సింహాద్రి, బుంగ ఈశ్వరరావు, మాణిక్యరావు, వలిశెట్టి సవరయ్యలు కలిసి అదే రోజు రాత్రి మర బోటుపై జోగా వలతో చేపల వేటకు వెళ్లారు. కొంత దూరం ప్రయాణం సాగించి డోకులపాడు తీరం వద్ద గల రాళ్ల సమీపంలో రాకాసి అల తాకిడికి బోటు బోల్తా పడింది. దీంతో మత్స్యకారులు చెల్లాచెదురుగా పడి హాహాకారాలు చేస్తూ ఈదుకుంటూ తీరానికి సురక్షితంగా చేరారు. అయితే ఈ ప్రమాదంతో బోటు మరమ్మతులకు గురి కాగా ఇంజిన్, వలలు సముద్ర అలలతో కొట్టుకుపోయాయి. ఈ మేరకు సోమవారం 50 మంది వరకు మత్స్యకారులు సంఘటన స్థలానికి చేరుకొని శ్రమించి బోట్‌ను మంచి నీటి తీరానికి చేర్చారు. అలాగే సముద్రంలో కొట్టుకుపోయిన ఇంజిన్, వలల కోసం గాలిస్తున్నారు. అయితే ఈ ప్రమాదంతో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని కోరారు.



సురక్షితంగా బయటపడిన బాధిత మత్స్యకారులు

సాగునీటి ప్రవాహానికి అంతరాయం

- నారాయణపురం కుడికాలువలో సైఫన్ బావికి గండి
- గండిని పరిశీలించిన జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: మండలంలోని చింతలపేట–షాలిపేట గ్రామాల మధ్య నారాయణపురం కుడికాలువ సైఫన్ బావికి ఆదివారం రాత్రి గండి పడింది. రెండు రోజుల పాటు ఆయకట్టుకు సాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. రంగారాయపురం గ్రామం వద్ద నారాయణపురం కుడికాలువ నీటి ప్రవాహానికి వీలుగా సైఫన్ ఏర్పాటుచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మందరాడ పెద్దచెరువు పొర్లి పారుతోంది. వీటికి తోడు కాలువలో 6వేల క్యూసెక్కుల మేర నీటిని నారాయణపురం ఆనకట్ట అధికారులు విడుదల చేశారు. వరదనీటితో వచ్చిన గుర్రపుడెక్క, చెత్తాచెదారం బావిలో నీటి ప్రవాహానికి అడ్డగా ఉండిపోయింది. నీరు రెండోవైపు వెళ్లలేక బావి గోడలను తాకడంతో ఓ వైపు కూలిపోయింది.

కాలువ నుంచి వచ్చిన నీరంతా దిగువ ప్రాంతాలకు పోటెత్తింది. షాలిపేట, మందరాడ, మల్లయ్యపేట, రామారాయపురం తదితర గ్రామాల పరిధిలోని మూడువేల ఎకరాలను కాలువ నీరు ముంచెత్తింది. విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు నారాయణపురం ఆనకట్ట అధికారులకు సమాచారం అందించి, కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గించే చర్యలు చేపట్టారు. కాలువ రెగ్యులేటర్ తలుపులు పూర్తిగా మూయించారు. గండిపడిన ప్రాంతాన్ని సోమవారం ఉదయం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట పొలాలను పరిశీలించాలని వ్యవసాయశాఖ ఏఓ పైల నవీన్‌కు సూచించారు. ఆనకట్ట డీఈఈ మురళీ, ఏఈ జీవీ రమణ, రవికుమార్ తదితరులు గండిని పరిశీలించారు. మండల పరిషత్ నుంచి మంజూరైన రూ.లక్షతో గోడ నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు.



గండిని పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు, అధికారులు

ఆగిన నీటి ప్రవాహం

గండి పడడంతో నారాయణపురం కుడికాలువ ద్వారా పొందూరు, ఎచ్చెర్ల మండలాలకు అందే సాగునీరు నిలిచిపోయింది. రెండురోజుల అనంతరం పనులు పూర్తికాగానే నీటిని కాలువలోకి మళ్లీ విడిచిపెడతామని అధికారులు తెలిపారు.

అవగాహనతోనే సైబర్ నేరాల కట్టడి


రాయగడ: అవగాహనతో సైబర్ నేరాలను అరికట్టవచ్చని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. స్థానిక బిజూ పట్నాయక్ ఇండోర్ స్టేడియంలో జిల్లా పోలీసు యంత్రాంగం సైబర్ నేరాల నివారణకు సంబంధించి చైతన్య ప్రచార రథాన్ని సోమవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే ప్రతీ ఒక్కరూ చైతన్యవంతులవ్వాలని పిలుపునిచ్చారు. రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు మాట్లాడుతూ.. సైబర్ నేరాల వల్ల అమాయకులు ఎలా మోసపోతున్నారో వివరించారు. ఎస్పీ వివేకానంద శర్మ మాట్లాడుతూ సైబర్ నేరాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని తెలియజేశారు. ఏఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్రో నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నితీష్ వాధ్వానీ సైబర్ రథాన్ని ప్రారంభించారు. ఈ రథంతో జిల్లాలోని చిత్రకొండ, కలిమెల, పోడియ, కోరుకొండ, ఖోయిర్‌పూట్, మత్తిలి, మల్కన్‌గిరి సమితుల్లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి, అదనపు కలెక్టర్ దేవదర్ ప్రధాన్, జిల్లా అదనపు వైద్యాధికారి అనీల్ కుమార్ మిశ్రో తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ వివరాలను ఎవరికీ తెలియజేయకూడదని ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ సూచించారు. స్థానిక కాలేజీ జంక్షన్‌లో సైబర్ నేరాల స్టాల్, సైరా అనే మస్కట్‌ను కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఆన్‌లైన్‌లో అజ్ఞాత వ్యక్తికి డెబిట్ కార్డు, పాన్ కార్డు, ఆధార్ కార్డు, యూపీఏ వివరాలు ఇవ్వకూడదన్నారు. ఈనెల 14వ తేదీ వరకు ఏడు సమితి కేంద్రాల్లో సైబర్ మొబైల్ వాహనం ద్వారా ప్రజలకు చైతన్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి ఆనంద్ సుబ్రహ్మణ్యం, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, ఏడీఎం రాజేంద్ర మింజ్. సబ్ కలెక్టర్ అలోక్ ప్రధాన్, అదనపు ఎస్పీ సునీల్ కుమార్ మహంతి, సైబర్ పోలీసు అధికారి కైలాష్ బెహరా తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: అవగాహన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి తదితరులు



రాయగడ: ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సరక తదితరులు



రాయగడ: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సరక



మల్కన్‌గిరి: అవగాహన సమావేశంలో పాల్గొన్న ఎస్పీ నితీష్ వాధ్వానీ తదితరులు

క్లుప్తంగా

చట్టం తన పని చేసింది

• సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

జామి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్ విషయంలో చట్టం తన పని తాను చేసిందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. జామి మండలంలోని జాగరం గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణకు సోమవారం వచ్చిన ఆయన కార్యక్రమం అనంతరం విలేకరులతో మట్లాడారు. ఈ సందర్భంగా సమావేశంలో పలువురు పాత్రికేయులు వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ తరఫున పోటీచేస్తారని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ పలువురితో చర్చించి నిర్ణయం తీసుకుంటానని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసే అవకాశముందన్నారు. ఎన్నికలు ఇంకా ఆరు మాసాలు ఉన్నాయని, ఓటుహక్కు ఎంతో విలువైందని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు నర్సిపురం క్రీడాకారిణులు

పార్వతీపురంటౌన్: జాతీయస్థాయిలో జరగనున్న అండర్-17 గరల్స్ హ్యాండ్‌బాల్ పోటీలకు నర్సిపురం క్రీడాకారిణులు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన ఎస్.జోత్స్న, కె.సౌమ్య మెయిన్ ప్లేయర్స్‌గా ఎస్ వర్షిణి స్టాండ్ బైగా ఎంపికైంది. పీడీ సబ్బాన మురళి ఆధ్వర్యంలో వారు శిక్షణ పొందారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లతో ఎస్సై హరిబాబు నాయుడు

గుర్ల: మండలంలోని ఆనందపురంలో చంపావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఎస్సై హరిబాబు నాయుడు సోమవారం పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఈ సందర్భంగా ఎస్సై చెప్పారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గొర్లి అప్పన్న

పార్వతీపురంటౌన్: మద్యం తాగవద్దని మందలించడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన గొర్లి అప్పన్నకు మద్యం తాగే అలవాటుంది. తన తల్లి, వదిన తాగొద్దని చెబుతూ ఉండడంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఆదివారం సాయంత్రం పశువులకు బలానికి తెచ్చి సిరప్ తాగేశాడు. కుటుంబసభ్యులు గమనించి చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

4,5 తేదీల్లో అండర్-19 స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్టు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ సోమవారం తెలిపారు. ఈ నెల 4న హ్యాండ్‌బాల్, 5న వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో ఆయా రోజుల్లో ఉదయం 10 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభవుతాయని పేర్కొన్నారు. 19 సంవత్సరాలలోపు వయస్సు కలిగి ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆధార్, స్టడీ సర్టిఫికెట్, పదో తరగతి మార్కుల జాబితాను వెంట తీసుకురావాలని సూచించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, ఆ రోజు జిల్లా జట్లకు అర్హత సాధించిన క్రీడాకారులు త్వరలో జరగనున్న అంతర్ జిల్లాల బాల, బాలికల పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. క్రీడాకారులు మరిన్ని వివరాలకు సెల్: 98851 11375 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. .

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయనగరం జిల్లాకు చెందిన భక్తులు సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు. విజయనగరం జిల్లా పూసపాటి రేగకు చెందిన పులప కాశీబాబు, నాగమణి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు సోమవారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళం అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

కూరల సాగుతో ఊరట

• ఏడాది పొడవునా వివిధ రకాల సాగు
• నిత్యం రూ.30 లక్షల వరకు క్రయ విక్రయాలు
• నాలుగు రాష్ట్రాలకు ఎగుమతి
• లాభాలు ఆర్జిస్తున్న రైతులు


బెండకాయలు కోస్తున్న రైతులు


సాగులో వివిధ రకాల కూరగాయల పంటలు


అంతరరాష్ట్ర మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు


విక్రయానికి మార్కెట్‌కు కూరగాయలు తీసుకొస్తున్న రైతులు

రామభద్రపురం: ఏటా ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. తాతల కాలం నుంచి ఆచరిస్తున్న సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి చెప్పి కూరగాయల సాగును జీవనాధారంగా ఎంచుకుంటున్నారు. ఈ ప్రాంత భూములు ఉద్యాన పంటల సాగుకు అనుకూలం కావడంతో పాటు అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్ సదుపాయం ఉండడంతో ప్రభుత్వం అందించే రైతుభరోసా సొమ్మును పెటుబడిగా పెట్టి ఏడాది పొడవునా వివిధ రకాల కూరగాయలను సాగుచేస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.సాగులో కుటుంబ సభ్యులంతా మమేకమై ఉపాధి పొందుతూ ఒడుదుడకులు లేకుండా జీవితాన్ని సాగిస్తున్నారు.

300 గ్రామాల్లో కూరగాయల సాగు

జిల్లాలో రామభద్రపురంతో పాటు బొబ్బిలి, బాడంగి, గజపతినగరం, దత్తిరాజేరు, మెరకముడిదాం, గజపతినగరం, సాలూరు, మక్కువ మండలాల పరిధిలోని సుమారు 300 గ్రామాలకు చెందిన రైతులు కూరగాయల సాగుతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు ఇస్తున్న సలహాలు, సూచనలను పాటిస్తూ విత్తు నుంచి దిగుబడి, విక్రయం వరకు కుటుంబ సభ్యులంతా వ్యవసాయ పనుల్లో భాగస్వాములవుతూ స్వయం సమృద్ధి సాధిస్తున్నారు. జిల్లాలో సుమారు 3 వేల ఎకరాల్లో వివిధ రకాల కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు.

700 కుటుంబాలకు కూరగాయల సాగే ప్రధాన వత్తి

రామభద్రపురం మండలంలోని ఆరికతోట, కొత్తరేగ,బాడంగి మండలంలోని కోడూరు, బొబ్బిలి మండలంలోని పాతబొబ్బిలిలో సుమారు 700 కూరాకుల కుటుంబాలకు కూరగాయల సాగే ప్రధాన వృత్తి.వీరు ప్రణాళికాబద్ధంగా దఫదఫాలుగా బీర, టమాటో, పొట్టి చిక్కుడు, పొడవు చిక్కుడు, మిరప, ఆనప వంగ,బెండ తదితర కూరగాయ పంటలను ఆధునిక పద్ధతుల్లో ప్రయోగాత్మకంగా సాగు చేస్తూ ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ ఆదాయం పొందుతున్నారు. రామభద్రపురం అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో కూరగాయల ధరలు కూడా రైతులకు అనుకూలంగా ఉండడంతో ప్రత్యామ్నాయ బాటలో ముందుకు సాగుతున్నారు.

అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్ సదుపాయం..

మండలకేంద్రంలో అంతరరాష్ట్ర కూరగాయల మార్కెట్ సదుపాయం ఉండడంతో అధిక శాతం మంది రైతులు కూరగాయల పంటలు పండిస్తున్నారు. ఇక్కడి మార్కెట్‌కు ఒడిశా రాష్ట్రంలోని రాయగడ,సుంకి, పొట్టంగి, జగదల్‌పూర్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, కర్నాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ప్రతిరోజూ వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి ఎగుమతి చేస్తుంటారు. రైతులు ఉదయాన్నే కోసిన కాయగూరలను నేరుగా మార్కెట్‌లోకి తేవడంతో తాజా పంటకోసం ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు అధికంగా కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు.ఈ మార్కెట్‌లో రోజూ సుమారు.రూ.20లక్షల నుంచి రూ.30 లక్షల వరకు క్రయ విక్రయాలు జరుగుతుంటాయి.

సస్యరక్షణ పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు

ప్రతి ఏడాది ఒకే రకమైన పంట కాకుండా పంట మార్పిడి చేయాలి. దాని వల్ల నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి గ్రామంలో ఉన్న ఆర్బీకేలో ఉద్యానశాఖాధికారులు ఉంటారు. వారి సలహాలు, సూచనలు పాటిస్తూ డిమాండ్ ఉన్న పంటలు పండిచాలి. ప్రకృతి వ్యవసాగు చేస్తే పెట్టుబడి తగ్గించుకుని అధిక ఆదాయం పొందవచ్చు. – రెడ్డి.శ్రీనివాసరావు, ఉద్యానశాఖ డీడీ,విజయనగరం

గురుకులాల సమస్యలు పరిష్కరించాలి


వినతి పత్రాన్ని అందుకుంటున్న ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: గురుకుల విద్యాలయాల్లో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని గిరిజన అధ్యాపకుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు సోమవారం విజయనగరం పట్టణంలో ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. గడిచిన మూడు సంవత్సరాలుగా గురుకులానికి కార్యదర్శి లేరని, రాష్ట్రంలో 39 కళాశాలలకు గాను కేవలం 10 కళాశాలల్లో మాత్రమే రెగ్యులర్ ప్రిన్సిపాల్స్ ఉన్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వ కల్పించిన 62 సంవత్సరాల పదవీ విరమణ వయసు పెంపు గురుకులాల ఉద్యోగులకు కూడా అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గురుకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో సంఘం జనరల్ సెక్రటరీ టి.శ్రీనివాసరావు, ఆర్గనైజేషన్ సెక్రటరీ వై.పారయ్య, కోశాధికారి ఎ.గణపతినాయుడు ఉన్నారు.

రామినాయుడు వలసలో 144 సెక్షన్

• జిల్లా అటవీ అధికారి జీఏపీ ప్రసూన

పార్వతీపురంటౌన్: ఏనుగుల సంచారం ఉన్న పార్వతీపురం మండలంలోని రామినాయుడు వలసలో 144వ సెక్షన్ అమలులో ఉందని పార్వతీపురం మన్యం జిల్లా అటవీ అధికారి జీఏపీ ప్రసూన తెలిపారు. తహసీల్దార్ ఈ ఉత్తర్వులు జారీ చేశారని ఆమె చెప్పారు. ఏనుగుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడు ఏనుగులు జియ్యమ్మవలస మండలం పెదమేరంగి కూడలి వద్ద రామినాయుడు వలస గ్రామం దగ్గరలో ఉన్నాయని పేర్కొన్నారు. ఏనుగులను అటవీ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. కన్నపుదొరవలస, పెద్దవలస, సుభద్రమ్మ వలస, సీమనాయుడువలస, భట్లభద్ర, నిమ్మలపాడు, వెంకట్రాజపురం, ఎరుకుల పేట, గొరింపేట ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కొంత మంది మద్యం తాగి రహదారులపై వివిధ వేళల్లో సంచరిస్తున్నారని అది కూడదని, అటవీ అధికారులు, సిబ్బంది సూచనలు సలహాలు పాటించాలని కోరారు. ఏనుగు 'హరి'కొమరాడ మండలం నడిమివలస కొండపై ఉందని, రాత్రి సమయంలో కొండ దిగువకు వస్తూ, తెల్లవారు జామున కొండ మీదకు వెళ్తోదని తెలిపారు. రేగుల పాడు, పెద్దఖేర్జెల, చినఖేర్జెల, బుజిగవలస, నడిమివలస మెట్ట, కోటిపాం, జంఝావతి, కుమ్మరిగుంట, ఆర్తాం గ్రామాల ప్రజలు సాయంత్రం, తెల్లవారు జామున పొలాల్లోకి వెళ్తున్నప్పుడు, ప్రయాణాలు సాగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. హరి ఏనుగు సమాచారాని న్-ఉలిపిరి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.సత్యనారాయణ ఫోన్ 93984 68628 నంబర్, మిగిలిన ఏనుగుల సమాచారాన్ని బోరి బీట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎం.కిరణ్ ఫోన్ 94405 95181 నంబర్‌కు కాల్ చేసి పొందవచ్చని సూచించారు.

గ్రామ సర్వేయర్ల క్రికెట్ టోర్నీ ప్రారంభం


టోర్నీలో పాల్గొన్న గ్రామ సర్వేయర్లు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రం శివారు విజ్జీ స్టేడియంలో ఉత్తరాంధ్ర గ్రామ సర్వేయర్ల క్రికెట్ టోర్నీ సోమవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. జోన్- 1 పరిధిలో ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాల్లోని గ్రామ సర్వేయర్లతో నిర్వహించనున్న క్రికెట్ టోర్నీని విజయనగరం జిల్లా సర్వేయర్స్ అధ్యక్షుడు చౌదరి వెంకటరావు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. తీవ్ర పని ఒత్తిడిలో ఉన్న గ్రామ సర్వేయర్లకు మానసిక ఉల్లాసాన్ని అందించేందుకు ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూరాడ మధుబాబు అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగ సంఘాలను చర్చలకు ఆహ్వానిస్తున్నందున, రాష్ట్రంలో ప్రతిష్టాత్మకమైన రీసర్వే చేస్తున్న గ్రామ సర్వేయర్స్ తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్ గ్రామ సర్వేయర్ల సంఘం ఏర్పాటు చేశామని తెలిపారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో పాగిరి విద్యార్థి ప్రతిభ


పి.నిష్ఠాత్

రాజాం సిటీ: మండల పరిధి పాగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.నిష్ఠాత్ అండర్-16 బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరిచాడు. రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌కు ఎంపికైన ఈ విద్యార్థి శ్రీకాకుళం జట్టు తరఫున పాల్గొన్నాడని హెచ్ఎం శాసపు సత్యనారాయణ సోమవారం తెలిపారు. కర్నూలు జిల్లా మహానందిలో జరిగిన ఫైనల్ పోరులో తన ప్రతిభతో జట్టుకు ప్రథమ బహుమతి సాధించడంలో కీలకపాత్ర వహించాడని చెప్పారు. జట్టు విజయంలో ప్రతిభకనబర్చిన విద్యార్థిని హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

అక్రమ మద్యం దుకాణంపై పోలీసుల దాడి


విలేకరుల సమావేశంలో సీఐ చంద్రశేఖర్, ఎస్సై వీర జనార్దన్

కొత్తవలస: మండలంలోని చింతలపాలెం గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణంపై సీఐ వి.చంద్రశేఖర్, ఎస్సై వీర జనార్దన్‌ల ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం సాయంత్రం దాడి చేశారు. ఈ సందర్భంగా దుకాణం నిర్వహిస్తున్న అదే గ్రామానికి చెందిన పిల్లా కృష్ణమూర్తిని అదుపులోకి తీసుకుని 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కృష్ణమూర్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు కార్లు ఢీకొని ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

గరుగుబిల్లి: పార్వతీపురం-శ్రీకాకుళం రహదారి పరిధిలో నాగూరు- దత్తివలస మార్గంలో ఖడ్గవలస నుంచి వీరఘట్టం వెళ్తున్న మారుతి సుజికీ బ్రిజా కారును, వీరఘట్టం నుంచి పార్వతీపురం వస్తున్న హుండయ్ అయాన్ కారు బలంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగి ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంపై ఎస్సై ఎం.రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బ్రిజా కారును హుండయ్ కారు ఢీకొనడంతో కారు పొలంలో బోల్తాపడింది. దీంతో కురుపాం మండలకేంద్రానికి చెందిన చౌదరి పోలందొరకు చిన్న చిన్న గాయాలయ్యాయి. అలాగే హుండయ్ ఇయాన్ కారులో ప్రయాణిస్తున్న డాక్టర్ నగేష్ రెడ్డికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ మేరకు 108 వాహనం ద్వారా వారిని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు. చౌదరి పోలం దొర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

జూనియర్స్ ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

• 20 నుంచి తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఖోఖో అసోసియేషన్ ప్రతినిధులు


జాతీయ పోటీలకు ఎంపికైన తనూజతో పీఈటీ సత్యప్రసాద్

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న జూనియర్స్ బాల, బాలికల ఖోఖో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు సోమవారం పూర్తయ్యాయి. ఈ మేరకు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో జరిగిన ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి 300 మందికి పైగా క్రీడాకారులు హాజరుకాగా..వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 18 మంది బాలురు, 18 మంది బాలికలను అంతర్ జిల్లాల పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్.సత్యనారాయణ తెలిపారు. ఎంపిక పోటీలను జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ చిన్నంనాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు కేఏ.బాలకృష్ణ, ఏఎస్ఎం కమలనాభరావు, కె.గోపాల్, సత్యనారాయణ, బైరెడ్డి శ్రీను, ప్రసన్న పర్యవేక్షించారు.

ఖేలో ఇండియా జాతీయపోటీలకు తనూజ

కార్పొరేషన్ పరిధిలో గల ఫూల్‌బాగ్‌కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తనూజ ఖేలో ఇండియా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆమె ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలో నిర్వహించే అంతర్ రాష్ట్రాల జూనియర్స్ ఖోఖో పోటీల్లో పాల్గొననుంది. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయపోటీలకు ఎంపికైన క్రీడాకారిణిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయులు సత్య ప్రసాద్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

తీరనున్న మాయదారి కష్టం


కొత్త రోడ్డు నిర్మాణం ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు(ఫైల్)

• రాజాం టు పాలకొండ కొత్త రోడ్డు నిర్మాణం
• రెండు విడతలుగా రూ.13 కోట్లు మంజూరు
• చురుగ్గా జరుగుతున్న పనులు


చురుగ్గా రోడ్డు విస్తరణ చేస్తున్న దృశ్యం

రేగిడి: రాజాం నుంచి పాలకొండకు కొత్త రోడ్డు నిర్మాణం ప్రారంభమైంది. గతంలో టీడీపీ, అంతకుముందు కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు ఈ రోడ్డును పూర్తిగా విస్మరించి వదిలేశాయి. కనీసం రోడ్డుపై పడిన గోతులు కూడా పూడ్చలేదు. ఫలితంగా రాజాం నుంచి పాలకొండ వరకూ ఎక్కడా కూడా తాత్కాలిక పనులతో కూడా సరిపెట్టేందుకు వీలు లేనంతగా రోడ్డు పాడైంది. అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలుమార్లు ఎస్టిమేట్ వేసి పనులకు టెండర్లు కోరింది. గతంలో తక్కువ నిధులు కావడంతో టెండర్లకు ఎవరూ రాకపోగా, ఈ దఫా ఆర్‌అండ్‌బీ శాఖ భారీగా నిధులు కేటాయించి, టెండర్లు పిలవగా, కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకుని పనులు చేపట్టారు.

రూ.13 కోట్లు మంజూరు

రాజాం నుంచి పాలకొండకు ప్రధాన రహదారి సమస్య ఎట్టకేలకు గట్టెక్కనుంది. ప్రస్తుతం పూర్తిగా పాడైన ఈ రోడ్డు ఎక్కువ కాలం మన్నికవచ్చేలా, పూర్తిస్థాయిలో డబల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 13 కోట్లు మంజూరు చేసింది. రాజాం జీఎంఆర్ ఐటీ నుంచి సంకిలి వరకూ రూ.9 కోట్లు తొలివిడతలో మంజూరు చేయగా, రెండో విడత టెండర్లలో సంకిలి నుంచి పాలకొండ వరకూ రూ.4 కోట్లు మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణాన్ని ఇటీవల ప్రజా ప్రతినిధులు ప్రారంభించగా, ప్రస్తుతం లైనింగ్ పనులు చివరిదశకు వచ్చాయి. రాజాం జీఎంఆర్ ఐటీ నుంచి పాలకొండ వరకూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న అడ్డంకులను, టెలిఫోన్ లైన్లు, వాటర్ పైప్‌లైన్, విద్యుత్ కనెక్షన్స్ గుర్తించి, వాటిని రోడ్డు పనులకు అడ్డంకి లేకుండా మార్చారు. కొత్తవాటిని ఏర్పాటుచేసి, పనులు ముమ్మరం చేశారు. పండగ నాటికి పనులు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ రోడ్డు పనులు జరుగుతుండడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఎట్టకేలకు సమస్య పరిష్కారమవుతోందని అభిప్రాయపడుతున్నారు.

త్వరగా పనులు

రాజాం పట్టణ ప్రధాన రహదారి విస్తరణతో పాటు రాజాం నుంచి పాలకొండ వరకూ కొత్తగా డబల్ రోడ్డు నిర్మాణానికి భారీగా నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పనులు చకచక చేస్తున్నాం. మూడు నెలల వ్యవధిలో రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం లైనింగ్ పనులు కొలిక్కివచ్చాయి.

– కేవీ ప్రసాదరావు, ఆర్‌అండ్‌బీ డీఈఈ, రాజాం

నారాయణపురం కాలువకు సైఫూన్ బావికి గండిపడిన ప్రాంతం



సైఫూన్‌కు గండి

• నారాయణపురం కుడికాలువలో నీటి ప్రవాహానికి అంతరాయం
• గండిని పరిశీలించిన జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు


గండిని పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు, అధికారులు

సంతకవిటి: మండలంలోని చింతలపేట-షాలిపేట గ్రామాల మధ్య నారాయణపురం కుడికాలువ సైఫూన్ బావికి ఆదివారం రాత్రి గండి పడింది. రెండు రోజుల పాటు ఆయకట్టుకు సాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. రంగారాయపురం గ్రామం వద్ద నారాయణపురం కుడికాలువ నీటి ప్రవాహానికి వీలుగా సైఫూన్ ఏర్పాటుచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మందరాడ పెద్దచెరువు పొర్లు పారుతోంది. వీటికి తోడు కాలువలో 6వేల క్యూసెక్కుల మేర నీటిని నారాయణపురం ఆనకట్ట అధికారులు విడుదల చేశారు. వరదనీటితో వచ్చిన గుర్రపుడెక్క, చెత్తాచెదారం బావిలో నీటి ప్రవాహానికి అడ్డగా ఉండిపోయింది. నీరు రెండోవైపు వెళ్లలేక బావి గోడలను తాకడంతో ఓ వైపు కూలిపోయాయి. కాలువ నుంచి వచ్చిన నీరంతా దిగువ ప్రాంతాలకు పోటెత్తింది. షాలిపేట, మందరాడ, మల్లయ్యపేట, రామారాయపురం తదితర గ్రామాల పరిధిలోని మూడువేల ఎకరాలను కాలువనీరు ముంచెత్తింది. విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు నారాయణపురం ఆనకట్ట అధికారులకు సమాచారం అందించి, కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గించే చర్యలు చేపట్టారు. కాలువ రెగ్యులేటర్ తలుపులు పూర్తిగా మూయించారు. గండిపడిన ప్రాంతాన్ని సోమవారం ఉదయం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట పొలాలను పరిశీలించాలని వ్యవసాయశాఖ ఏఓ పైల నవీన్‌కు సూచించారు. ఆనకట్ట డీఈఈ మురళీ, ఏఈ జీవీ రమణ, రవికుమార్ తదితరులు గండిని పరిశీలించారు. మండల పరిషత్ నుంచి మంజూరైన రూ.లక్షతో గోడ నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు.

ఆగిన నీటి ప్రవాహం

గండి పడడంతో నారాయణపురం కుడికాలువ ద్వారా పొందూరు, ఎచ్చెర్ల మండలాలకు అందే సాగునీరు నిలిచిపోయింది. రెండురోజుల అనంతరం పనులు పూర్తికాగానే నీటిని కాలువలోకి మళ్లీ విడిచిపెడతామని అధికారులు తెలిపారు.